సాక్షి
సూర్యాపేట

శుక్రవారం : 12 : జూలై : 2024



ఓజో అగ్రికేర్‌లో అగ్ని ప్రమాదం

చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం శివారులోని ఓజో అగ్రి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగింది. - 8లో



రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు

రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత రాంచందర్‌రావు అన్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం

32 / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట): నల్లగొండలోని బీసీ భవన్ వద్ద ఈనెల 13న నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చలమల నరసింహ కోరారు. గురువారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొని విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి భూపతి నారాయణ, ఉపాధ్యక్షుడు కందాల భాస్కర్, నాయకులు రమేష్, జానయ్య, గొట్టిపర్తి శ్రీకాంత్, నిద్ర సంపత్ నాయుడు, తన్నీరు వాసుదేవ్, కోడి లింగయ్య, విజయకృష్ణ, దాసరి వెంకన్న, పల్స సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుతో సంక్షేమ పథకాలు పొందాలి



మాట్లాడుతున్న నారాయణస్వామి

భానుపురి (సూర్యాపేట): ప్రతి ఎలక్ట్రీషియన్ లేబర్ కార్డు తీసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ నారాయణస్వామి కోరారు. గురువారం సూర్యాపేట పట్టణంలో ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రీషియన్లు పని ప్రదేశంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ డైరెక్టర్ కృష్ణారెడ్డి, తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రవణ్ కుమార్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, బాలస్వామి, రామచంద్రయ్య, నబి, మహమ్మద్ అలీ, శ్రీనివాస్, సోమయ్య, మధు, జానయ్య, రమేష్, సత్యనారాయణ, సైదులు, జానీ పాషా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు అడ్వకేట్ క్లర్క్స్ అసోసియేషన్ ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన జగ్గారావు

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టులో గురువారం అడ్వకేట్ క్లర్క్స్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ క్లర్క్ సూరినేని జగ్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అదుపు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా అల్లిరాజు, జాయింట్ సెక్రటరీగా నీలా లోకేష్, కోశాధికారిగా హరీశ్, సభ్యులుగా రత్తపు రాము, భానోతు రవి, సపావత్ సైదాలు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కోర్టు క్లర్క్స్ అభినందనలు తెలిపారు.

20న పీఓడబ్ల్యూ జిల్లా మహాసభలు

భానుపురి (సూర్యాపేట): కోదాడలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే పీఓడబ్ల్యూ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ కోరారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పీఓడబ్ల్యూ అనేక పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. గత ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రామలింగమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కలమ్మ, చైతన్య, రమ, రామతార తదితరులు పాల్గొన్నారు.

31 వరకు సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేటటౌన్: సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి లత, ఎస్సీ స్టడీ సర్కిల్ హానరరి డైరెక్టర్ చిట్టిపాక రాములు గురువారం తెలిపారు. http//:tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సన్నాల సాగుకే మొగ్గు



సూర్యాపేటలో రైతు సాగు చేస్తున్న సన్నరకం వరి నారుమడి

- బోరుబావుల కింద సన్నరకాల సాగుకు రైతులు సన్నద్ధం
- మార్కెట్‌లో మంచి ధర ఉండడం, ప్రభుత్వ బోనస్‌తో వీటి సాగువైపు దృష్టి
- ఇప్పటివరకు 5వేల ఎకరాల్లో వరి నాట్లు వేయగా 3,500 ఎకరాల్లో సన్నాలే..

సూర్యాపేట: దొడ్డురకం సాగుచేస్తే పంటను అమ్ముకునే సమయంలో చాలా అవస్థలు పడాల్సి వస్తుండడంతో జిల్లాలో సన్నరకం వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గతేడాది వివిధ రకాల వరి సాగు చేసినా.. ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ దృష్ట్యా ఈ సీజన్‌లో సన్నాల సాగు వైపు ఆలోచన చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర వస్తుండడం, దీనికి తోడు సన్నరకాలకు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ సాగువైపు దృష్టి సారిస్తున్నారు. ఇన్ని విధాలుగా ప్రయోజనాలు ఉండడంతో సన్నరకం వరి సాగు చేసేందుకు బోరుబావుల కింద ఉన్న రైతులు సిద్ధమయ్యారు.

ఎక్కడైనా సన్నరకం నారే..

ప్రస్తుతం జిల్లాలో వరి సాగుకు అనువైన వర్షాలు పడలేదు. గతేడాదితో పోల్చినా తక్కువ వర్షపాతమే నమోదైంది. ఈ క్రమంలో పెద్దవర్షాలు వస్తే నాట్లు వేసే విధంగా జిల్లా రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో అన్ని పంటలు కలిపి 6.34 లక్షల ఎకరాల్లో సాగుచేస్తారని, ఇందులో 4.65 లక్షల ఎకరాల్లో వరి సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేశారు. దీనికి అనుగుణంగా రైతులకు కావాల్సిన వరి విత్తనాలను ఆగ్రోస్, ఇతర విత్తనాల దుకాణాల్లో రకరకాల విత్తనాలు అందుబాటులో ఉంచారు. ఇందులో సాంబా మసూరి, జై శ్రీరాం, ఆర్ఎఆర్, హెచ్ఎంటీ, చింట్లు, బీపీటీ రకాలు ఎక్కువగా కొనుగోలు చేసి నార్లు పోశారు. జిల్లాలో ఇప్పటివరకు 5వేల ఎకరాల్లో వరి నాట్లు పడగా 3,500 ఎకరాల్లో సన్న రకం ఉండే అవకాశం ఉంది. ఇంకా వరి విత్తనాల కొనుగోలు ముమ్మరంగా సాగుతుండగా.. ఇప్పటివరకు 70 శాతం మేర సన్నా రకం విత్తనాలను రైతులు కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మార్కెటింగ్ సౌకర్యంతోపాటు, అధిక ధర పలుకుతుండడంతో..

సన్నరకాలు సాగుచేస్తే సులభంగా మార్కెటింగ్‌తోపాటు, అధిక ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. గతేడాది వానాకాలం, యాసంగిలో సన్న రకం సాగుచేసిన రైతులకు మిల్లులు, మార్కెట్ యార్డులో మంచి ధర పడింది. అది కూడా హార్వెస్ట్ చేసిన వెంటనే మిల్లుల యాజమానులు కొనుగోలు చేశారు. ఇలా పచ్చి ధాన్యం సన్నరకాలు క్వింటాకు రూ.2600 వరకు పెట్టి వ్యాపారులు కొనుగోలు చేశారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్-ఏ రకం రూ. 2,260, సాధారణ గ్రేడ్ రూ. 2220 మాత్రమే పెట్టారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం ఆరబోసి, తేమశాతం లేకుండా చూసి గాలి, దుమారం, వర్షానికి ఇబ్బంది పడి అమ్మడం కన్నా.. సన్నాలు వేస్తే ఏ చికాకు లేకుండా మంచి ధరకు అమ్మే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఏడాది మద్దతు ధర గత ఏడాది కన్నా క్వింటాకు రూ. 100 పెంచడంతో గ్రేడ్-ఏ రకం రూ.2,360, కామ రకం రూ.2,320 పలుకుతుంది. దీనికి తోడు ప్రభుత్వం చెప్పిన విధంగా సన్న రకాలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తే ధర రూ. 2,860కి చేరుతుందన్న ఆలోచనతో రైతాంగం ఈ దిశగా సాగు చేస్తున్నారు.

పంట రుణాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి



2024-25 వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట): పంట రుణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎల్‌డీఎం సీహెచ్ బాపూజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 2500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24 నాలుగో త్రైమాసికంలో పంట రుణాలపై రూ.2,614.67 కోట్ల లక్ష్యం కాగా 3,365.95 కోట్ల రుణాలు అందించి 128.73 శాతం వృద్ధి సాధించడం జరిగిందన్నారు. వ్యవసాయ టర్మ్ లోన్ లక్ష్యం రూ.1363.93 కోట్ల లక్ష్యం ఉండగా రూ.1,713.22 కోట్ల రుణాలు అందించి 125.60 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పారు. మొత్తంగా వ్యవసాయ రుణాల్లో రూ.3,978.6 కోట్లు లక్ష్యం కాగా రూ.5,079.17 కోట్ల రుణాలు అందించి 127.66 శాతం వృద్ధి సాధించామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.457.47 కోట్ల లక్ష్యం కాగా రూ.985.12 కోట్ల రుణాలు అందజేసి 215.34 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. ఇతర సెక్టార్‌లలో రూ.4755.54 కోట్లు లక్ష్యం కాగా రూ.6216.73 కోట్ల రుణాలు అందించి 130.07 వృద్ధి సాధించామన్నారు. మొత్తంగా ఆర్థిక సంవత్సరానికి రూ.5,133.13కోట్ల లక్ష్యానికి రూ.8,028.37 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. వృద్ధి 156.40 ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించే దిశగా రూ.589.52 కోట్ల లక్ష్యం కాగా రూ.526.58 కోట్ల రుణాలు అందజేశామన్నారు. అనంతరం 2024-25 సంవత్సరానికి వార్షిక ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ ఎల్‌డీఎం బాపూజీ, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ సాయితేజ, ఎస్‌బీఐ ఏజీఎం ఉపేందర్ భాస్కర్, నాబార్డ్ జీఎం సత్యనారాయణ, ఏపీజీవీబీ ఏజీఎం విజయ భాస్కర్, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, పరిశ్రమల జీఎం సీతారాం నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, అనసూర్య, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సాండ్ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక వాహనాలను చెక్‌పోస్టుల వద్ద పరిశీలించాలన్నారు. జాజిరెడ్డిగూడెం నుంచి ప్రాజెక్ట్ పనులకు వెళ్తున్న వాహనాలన్నింటికీ జీపీఎస్ ట్యాగ్ ద్వారా పరిశీలించాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఖమ్మం మున్నేరు ప్రాజెక్టు, శివన్న గూడెం ప్రాజెక్టుకు వెళ్తున్న ఇసుక వాహనాల రిపోర్టును ప్రతివారం అందజేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓ వేణుమాధవరావు, జాజిరెడ్డిగూడెం తహసీల్దారు శ్రీనివాసరావు, టీజీఎండీసీ ఎల్ఐసీ మైపాల్ రెడ్డి, మైనింగ్ అధికారి విజయ రామరాజు, ఇరిగేషన్ ఈఈ లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, గ్రౌండ్ వాటర్ డీడీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

భానుపురి (సూర్యాపేట): అపరిష్కృతంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావిళ్ల సీతారామయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ఉచిత వైద్యం అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. క్వాంటం పీరియడ్ 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలుగా పరిగణించడంతోపాటు పీఆర్సీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, కోశాధికారి హమీద్ ఖాన్, జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, సీనియర్ ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయాలి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని గురువారం డీపీఓ, మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. గృహజ్యోతి, గ్యాస్‌సబ్సిడీ ఆన్‌లైన్ నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రామన్నగూడెంలో వననర్సరీని పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతిఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఏఓ మల్లారెడ్డి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు నర్సింహరాజు, నవీన్, ఏఈఓ సత్యం, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ రావు తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రం పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రెడ్డి

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

- డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేటటౌన్: కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన కుటుంబాలకు నగదు అందజేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ జనాభా పెరుగుదలపై అవగాహన ఉండాలన్నారు. దంపతులు అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని చెప్పారు. జనాభా పెరుగుదల సమాజంలోని అన్ని రంగాలపై ప్రభావం చూపుతుందని, అభివృద్ధికి నిరోధకంగా మారుతుందని తెలిపారు. సమావేశంలో వైద్యులు వనజ, జయ శ్యామ్ సుందర్, వెంకటరమణ, చంద్రశేఖర్, కోటిరత్నం, నాజియా తబస్సుమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వర్మ

సూర్యాపేటటౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన ఉపకార వేతనాలు, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది స్కాలర్‌షిప్ కోసం అప్లై చేసుకుంటున్నారని, వీరికి సంవత్సరానికి మూడు వేల కోట్లు అవసరమవుతాయని, కానీ 2019 నుంచి ఇప్పటివరకు రూ.8214.57 కోట్ల ఫీజు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆందోళన చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల నాటికి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు యాతాకుల ప్రవీణ్, వినయ్, రవి, గోపి, మధు, అరుణ్, అజయ్, భార్గవి, అరుణ, స్వప్న, గీతిక, స్పందన, సౌజన్య, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేస్తాం

- జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్



ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్

మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది ఆగస్టు 25 నాటికి ఒక యూనిట్, సెప్టెంబర్ 25 నాటికి మరో యూనిట్ ద్వారా మొత్తం రెండు యూనిట్ల నుంచి 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనను మొదటి దశలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అనంతరం పవర్ ప్లాంట్‌లోకి బొగ్గు రవాణా కోసం చేపడుతున్న రైల్వే లైన్ పనులతోపాటు బాయిలర్లు, కంట్రోల్‌రూమ్, కూలింగ్ టవర్లు, టర్బైన్లను, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లను పరిశీలించారు. అనంతరం జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన వెంట డైరెక్టర్ సచిదానందం, ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్, చీఫ్ ఇంజనీర్లు సమ్మయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, డీఈ హనుమాన్, ఎస్ఐ ఇరుగు రవి తదితరులు ఉన్నారు.

తాడువాయిని వణికిస్తున్న విషజ్వరాలు



తాడువాయిలో సీసీరోడ్డుపై నిలిచిన మురుగు



తాడువాయిలో నిల్వ ఉన్న మురుగు

- సుమారు 100మందికి పైగా జ్వరాల బారిన పడిన గ్రామస్తులు
- గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మునగాల: మండలంలోని తాడువాయి గ్రామస్తులను విషజ్వరాలు వణికిస్తున్నాయి. గత నెల రోజుల నుంచి ఇప్పటివరకు సుమారు 100మందికి పైగా విషజ్వరాల బారిన పడినట్లు సమాచారం. గ్రామంలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం విషజ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో పదిహేను రోజులుగా రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య లోపంతో దోమల ఉధృతి పెరిగి విషజ్వరాలు ప్రబలడానికి కారణమని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానికంగా ఉన్న పల్లెదవాఖా నాలో వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి గ్రామంలో జ్వర పీడితులను గుర్తించి వారికి వైద్యం అందిస్తున్నారు.

అధ్వానంగా మురుగు కాలువలు..

గ్రామంలోని అనేక వీధుల్లో మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. మురుగు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడమే కాక దోమల వ్యాప్తి పెరిగింది. పలు వీధుల్లో సీసీరోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండి కనీసం నడిచే వీలులేకుండా పోయింది. కాలువలు శుభ్రం చేసినప్పటికీ మురుగునీరు పూర్తిస్థాయిలో ప్రవహించడం లేదు.

గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

తాడువాయిలో విషజ్వరాలు ప్రబలుతుండడంతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్ గురువారం గ్రామాన్ని సందర్శించారు. పలువీధులను కలియతిరిగి పారిశుద్ధ్య లోపం ఎక్కువగా ఉందని గుర్తించారు. దోమల ఉధృతిని అరికట్టేందుకు నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక పల్లెదవాఖానాలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన వెంట రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీశైలం, పల్లెదవాఖాన వైద్యాధికారి వైష్ణవి, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా



నేను గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. గ్రామంలోని పల్లె దవాఖానాలో రెండురోజులు చికిత్స పొందాను. జ్వరం తగ్గకపోవడంతో మునగాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. ప్రస్తుతం కొంత ఉపశమనం లభించింది. గ్రామంలో ప్రతి ఇంటిలో ఒకరు జ్వరం బారిన పడ్డారు.

– వట్యాల గుర్వయ్య, తాడువాయి

మురుగు కాలువలు శుభ్రం చేయిస్తున్నాం

గ్రామంలో వారానికి రెండుసార్లు మురగు కాలువలు శుభ్రం చేయిస్తున్నాం. శానిటేషన్ కూడా చేపడుతున్నాం. మురుగు కాలువల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు సీసీ రోడ్ల పైకి వస్తోంది.

– అబ్బగాని సతీష్, పంచాయతీ కార్యదర్శి, తాడువాయి

అవగాహన కల్పిస్తున్నాం

గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతున్న విషయం వాస్తవమే. పక్షం రోజులుగా గ్రామంలో ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. పల్లెదవాఖానాలో జ్వర పీడితులకు రక్త పరీక్ష నమూనాలు సేకరిస్తున్నాం. సకాలంలో వైద్యచికిత్స అందిస్తున్నాం.

– వైష్ణవి, పల్లెదవాఖానా వైద్యాధికారి, తాడువాయి

క్లుప్తంగా

కేఆర్‌ఆర్‌ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



స్వయం ప్రతిపత్తి హోదాపత్రాలను చూపుతున్న అధ్యాపకులు

కోదాడ : కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్‌ కమిషన్‌ (యూజీసీ) ఈ విద్యాసంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల వరకు స్వయం ప్రతిపత్తిని ప్రకటించింది. ఈ మేరకు యూజీసీ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్‌ గోపిచంద్‌ మెరుగు మహాత్మాగాంధీ యూనివర్సిటీకి సమాచారం అందించారు. 2024–25 విద్యాసంవత్సరం నుంచి 2028–2029 విద్యా సంవత్సరం వరకు ఈ అనుమతి లభించనుంది. దీనిని రెన్యూవల్‌ చేసుకోవడానికి గడువు ముగిసే సమయానికి మూడు నెలల ముందు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. తమ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడం పట్ల ప్రిన్సిపాల్‌ ఎం.నాగు, అధ్యాపకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

పులి సంచారం వదంతులను నమ్మొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ ఉదయ్‌కుమార్‌

చింతపల్లి : చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామంలో రెండు రోజుల నుంచి పులితో పాటు పులి పిల్లలు సంచరిస్తున్నాయన్న వదంతులను గ్రామస్తులు నమ్మొద్దని ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ ఉదయ్‌కుమార్‌ అన్నారు. గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించి రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో అడవి జంగిపిల్లులు సంచరిస్తున్నాయని, పులి ఉన్నట్లు వస్తున్న వదంతులను నమ్మొద్దని, అది కేవలం అడవి పిల్లి మాత్రమేనన్నారు. అటవీ ప్రాంతం లేనందున పులి వచ్చే అవకాశం లేదన్నారు.

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్‌: ఉరేసుకుని బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం జరిగింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బాలిక (13) స్కూల్‌కు వెళ్లలేదని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఉరివేసుకుని వేలాడుతున్న కూతురును చూసి బోరున విలపించింది. స్థానికుల సహాయంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్‌ పోలీసులు పేర్కొన్నారు.

పరారీలో నిందితులు

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ పరిధిలోని చింతలగూడేనికి కొత్త కళ్యాణి ఆత్మహత్యకు కారణమైన నిందితులు పరారీలోనే ఉన్నారు. ఇద్దరు యువకులు వాట్సాప్‌, సోషల్‌ మీడియాలో కళ్యాణి ఫొటోలను స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరించడంతో ఆమె కలుపు నివారణ మందు తాగి నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కళ్యాణి మృతికి కారణమైన యువకులను పట్టుకోవడానికి పోలీసులు మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల బంధువుల ఇళ్లలో విచారించడంతో పాటు సెల్‌ఫోన్‌ సిగ్నల్స్‌ ఆధారంగా వారిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఒకరైన కొమ్మనబోయిన మధు నిద్రమాత్రలు మింగి ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఓజో అగ్రికేర్‌ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- ప్రొడక్షన్‌ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- కూలిపోయిన ప్రొడక్షన్‌ యూనిట్‌ షెడ్‌
- పూర్తిగా దెబ్బతిన్న భవనాలు, యంత్రాలు, ముడిసరుకు
- రూ.40కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

చౌటుప్పల్‌: చౌటుప్పల్‌ మండలం దేవలమ్మ నాగారం రెవెన్యూ పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో గల ఓజో అగ్రి కేర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ప్రొడక్షన్‌ బ్లాక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రొడక్షన్‌ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. పరిశ్రమ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఏర్పాటు చేసిన ఓజో అగ్రి కేర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ పరిశ్రమలో వ్యవసాయానికి సంబంధించిన పలు రకాల క్రిమిసంహారక మందులను ఉత్పత్తి చేస్తారు. ఈ పరిశ్రమలో సుమారు 70మంది పనిచేస్తున్నారు. పరిశ్రమలో ఉదయం ఉత్పత్తి జరుగుతుండగా.. రాత్రి సమయంలో మరుసటిరోజు ఉదయానికి అవసరమైన ప్రొడక్షన్‌ను మిక్షర్‌ యూనిట్ల ద్వారా తయారు చేసుకుంటారు. రోజుమాదిరిగానే బుధవారం రాత్రి ఉద్యోగులు, కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆరుగురు సిబ్బంది మాత్రం రాత్రి విధుల్లో ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా మంటలు

అర్ధరాత్రి 1.30గంటల సమయంలో ప్రొడక్షన్‌ బ్లాక్‌లో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు వచ్చాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో మంటలను గమనించలేదు. అనంతరం దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడుతుండడంతో ప్రధాన ద్వారం వైపున ఉన్న సిబ్బంది గమనించి కంపెనీ నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద తీవ్రతను పరిశీలించి మంటలను అదుపు చేసేందుకు చౌటుప్పల్‌తో పాటు రామన్నపేట, హయత్‌నగర్‌, ఎల్‌బీనగర్‌, భువనగిరి, ఆలేరు నుంచి ఫైర్‌ ఇంజన్లను రప్పించారు.



ఓజో అగ్రికేర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీలోని ప్రొడక్షన్‌ బ్లాక్‌లో ఎగిసిపడుతున్న మంటలు



అగ్నిప్రమాదం కారణంగా దెబ్బతిన్న ముడిసరుకు

ముడి సరుకు, రియాక్టర్లతోనే పెరిగిన ప్రమాద తీవ్రత

ప్రస్తుతం వ్యవసాయ సీజన్‌ కావడంతో పరిశ్రమలో పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. బుధవారం రాత్రి ప్రొడక్షన్‌ బ్లాక్‌లో 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ఉంది. ఆయా ఉత్పత్తులను గురువారం ప్యాకింగ్‌ చేయాల్సి ఉండేది. ప్యాకింగ్‌ చేసే అట్టలకు అంటుకున్న మంటలు ఉధృతం కావడంతో పక్కనే ఉన్న 8 రియాక్టర్లు పేలిపోయాయి. దీంతో ప్రొడక్షన్‌ బ్లాక్‌తో పాటు పక్కనే ముడి సరుకు భద్రపరిచే మరో బ్లాక్‌కు మంటలు అంటుకుని కూలిపోయాయి. ఆరు ఫైర్‌ ఇంజన్‌లు, స్థానికంగా ఉన్న వాటర్‌ ట్యాంకర్ల ద్వారా గురువారం ఉదయం 10గంటల ప్రాంతంలో మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే కూలిపోయిన శిథిలాల కింద మళ్లీ మంటలు వ్యాపించడంతో వాటిని అదుపు చేసేందుకు ఫైర్‌ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ధ్వంసమైన భవన శిథిలాలను జేసీబీలతో కూల్చివేశారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రూ.40కోట్లకు పైగా నష్టం..

ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 40కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని పరిశ్రమ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎస్‌. రవికుమార్‌ తెలిపారు. 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిందన్నారు. దాని విలువ సుమారు రూ.30కోట్లు ఉంటుందని, అదేవిధంగా రూ.12కోట్ల విలువైన యంత్రాలు, రూ.10కోట్ల విలువైన వివిధ భవనాలు, షెడ్లు కూలిపోయాయని ఆయన పేర్కొన్నారు. సీఐ అశోక్‌రెడ్డి దగ్గరుండి మంటలను ఆర్పించే చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు ప్రొడక్షన్‌, ముడి సరుకు భద్రపరచే ప్లాంట్లను పరిశీలించి ప్రాథమిక అంచనా రూపొందించారు. అదేవిధంగా పరిశ్రమను వివిధ శాఖల అధికారులు సైతం సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన యంత్రాలు



పూర్తిగా కూలిపోయిన షెడ్లు

దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హాలియా : సమాజంలో ప్రతి విద్యార్థి సినిమా హీరోలను కాకుండా దేశ నాయకులను ఆదర్శంగా తీసుకొని తమ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకుంటే అప్పుడే సార్థకత కలుగుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్‌, ఫ్రెండ్స్‌ యూత్‌ సొసైటీ ఆధ్వర్యంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు పాఠశాలల విద్యార్థుల ముఖాముఖీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తమ జీవితాలను బంగారుమయంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి ఫౌండేషన్‌ చైర్మన్‌ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్‌ మార్టిన్‌ ఇనిస్టిట్యూట్‌ చైర్మన్‌ లక్ష్మణ్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్‌, మండల విద్యాధికారి బాలునాయక్‌, జేడీ ఫౌండేషన్‌ కన్వీనర్‌ కవిత, పర్యావరణ వేత్త సురేష్‌ గుప్తా, ఫ్రెండ్స్‌ యూత్‌ సొసైటీ ఫౌండర్‌ మెగావత్‌ కొండానాయక్‌, అధ్యక్షుడు భరత్‌కుమార్‌, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అంజి, సాయి, రమేష్‌, సురేష్‌, శ్రీను, కార్తీక్‌, నవీన్‌ కుమార్‌, శ్రీకాంత్‌, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రమేష్‌ (ఫైల్‌)

కొండమల్లేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పూల్‌సింగ్‌ తండాకు చెందిన నేనావత్‌ భాస్కర్‌, సక్కు దంపతుల మూడో కుమారుడు నేనావత్‌ రమేష్‌(32) పదేళ్ల క్రితం మిర్యాలగూడ మండలం మాటూరు తండాకు చెందిన భారతిని వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో గత ఐదేళ్ల నుంచి భార్య భారతి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రమేష్‌ గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

యాదాద్రిలో సీపీ సుధీర్‌బాబు పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాచకొండ నూతన సీపీ సుధీర్‌బాబు గురువారం రాత్రి సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఆలయానికి రావడంతో అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న సీపీ సుధీర్‌బాబుకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. సీపీ వెంట డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.



సీపీ సుధీర్‌బాబుకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు

130మంది రైతులకు నోటీసులు

చింతపల్లి : డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి చింతపల్లి మండల కేంద్రంలోని రైతుల నుంచి భూ సేకరణకు ఇరిగేషన్‌ శాఖ అధికారులు, జిల్లా స్పెషల్‌ కలెక్టర్‌ గురువారం సుమారు 130 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలో ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్‌ చేయగా అప్పట్లో కొంత మంది రైతులకు పరిహారంగా రూ.5.15లక్షలు అందించగా, గతంలో మరో 130మంది రైతులు భూసేకరణకు ఒప్పంద పత్రంపై సంతకం చేసినప్పటికీ వారికి పరిహారం అందించలేదు. ప్రస్తుతం 480ఎకరాలకు గాను 130మంది రైతులు గురువారం వ్యవసాయ పనులకు వెళ్లగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వారి ఇళ్లకు నోటీసులు అంటించారు. దీంతో కంగుతిన్న రైతులు అధికారుల తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5.15లక్షలు పరిహారం అందిస్తామని చెప్పిందని, ప్రస్తుత మార్కెట్‌ విలువ ప్రకారం పరిహారం అందించాలని, గతంలో సంతకాలు చేసిన రైతులతో పాటు సంతకాలు చేయని రైతులకు సమానంగా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేస్తున్నారు.

ఇళ్లలో నగదు, బంగారం, వెండి అపహరణ

చివ్వెంల : గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి అపహరించారు. ఈ సంఘటన మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులోని సుగుణ వెంచర్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగుణ వెంచర్‌ కాలనీకి చెందిన కొప్పుల కిరణ్‌, గట్ల ఉదయలక్ష్మి తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. గమనించిన దొంగలు అర్ధరాత్రి సమయంలో రెండు ఇళ్లలో చొరబడి రెండు తులాల బంగారం, 15తులాల వెండి, రూ.6 వేల నగదు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కిరణ్‌ ఇంట్లో చిందర వందరగా పడవేసిన వస్తువులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి వెంకటేశ్వర్లు, గబ్బెట సత్యనారాయణ(71) ఇరువురు కలిసి స్థానిక రైస్‌మిల్లులో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి తిరుమలగిరికి వస్తున్న కారు అతివేగంగా వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌ వెనుక కూర్చున్న గబ్బెట సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను 108లో సూర్యాపేటకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఉమేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.సత్యనారాయణ తెలిపారు.

పోలీసులకు శిక్షణ ఎంతో కీలకం

- తెలంగాణ పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌, అడిషనల్‌ డీజీపీ అభిలాష బిస్త్‌

నల్లగొండ క్రైం: పోలీసులకు శిక్షణలో ఎంతో కీలమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయని తెలంగాణ పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌, అడిషనల్‌ డీజీపీ అభిలాష బిస్త్‌ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్‌ శిక్షణ కేంద్రాన్ని, అన్నెపర్తి 12వ బెటాలియన్‌లోని పోలీస్‌ శిక్షణ కేంద్రాన్ని ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌, బెటాలియన్‌ కమాండెంట్‌ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. పోలీస్‌ శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయన్నారు. పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అందుతున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే అవకాశం కేవలం పోలీసు శాఖకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీటీసీ వైస్‌ ప్రిన్సిపాల్‌ విఠల్‌రెడ్డి, ఆర్‌ఐ హరిబాబు, ఎస్‌ఐలు క్రాంతికుమార్‌, బాబు, శ్రీనివాస్‌, భరత్‌, అఖిల్‌, అసిస్టెంట్‌ కమాండెంట్లు వెంకటేశ్వర్లు, రవిచంద్రన్‌, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్‌ అకాడమీ డైరెక్టర్‌ అభిలాష బిస్త్‌

రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు

- బీజేపీ నేత రాంచందర్‌రావు

సూర్యాపేట : ప్రజల ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీదే భవిష్యత్తు అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత రాంచందర్‌రావు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీగార్డెన్‌లో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్‌ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్‌ ఎన్నికలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. నల్లగొండ పార్లమెంట్‌ నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్‌ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు. పార్టీని రెండో స్థానంలోకి తీసుకొచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ నుంచి గ్రామ, మండల స్థాయి నాయకులందరూ బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నల్లగొండ పార్లమెంట్‌ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్‌ కన్వీనర్‌ బండారు ప్రసాద్‌, అసెంబ్లీ కన్వీనర్‌ కర్నాటి కిషన్‌, మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

కృష్ణంరాజుకు నాలుగు గెజిటెడ్‌ ఉద్యోగాలు

- డిగ్రీ, జూనియర్‌ కాలేజీ, పాలిటెక్నిక్‌, గురుకుల లెక్చరర్‌ ఉద్యోగాలకు ఎంపిక
- స్వస్థలం శాలిగౌరారం మండలం అడ్లూరు
- ప్రస్తుతం బాసర ట్రిపుల్‌ ఐటీలో ఫిజిక్స్‌ లెక్చరర్‌గా విధులు



కృష్ణంరాజు

శాలిగౌరారం: ప్రభుత్వ ఉద్యోగ సాధనలో ప్రస్తుతం పెరిగిన తీవ్రమైన పోటీ నేపథ్యంలో ఒక ఉద్యోగాన్ని పొందడమే కష్టంగా మారిన తరుణంలో ఒక వ్యక్తి ఒకటి, రెండు కాదూ ఏకంగా నాలుగు ప్రభుత్వ గెజిటెడ్‌ ఉద్యోగాలను సాధించాడు. వివరాలలోకి వెళ్తే.. శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణంరాజుది వ్యవసాయ కుటుంబం. ఇంటర్మీడియట్‌ మినహా ఇస్తే ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేశాడు. 2008లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేసిన వెంటనే 2008లో బాసర ట్రిపుల్‌ ఐటీలో కాంట్రాక్ట్‌ పద్ధతిలో ఫిజిక్స్‌ లెక్చరర్‌గా విధుల్లో చేరి నేటి వరకు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో భాగంగా ఇటీవల వెలువడిన పలు ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి డిగ్రీ, జూనియర్‌ కాలేజీ, పాలిటెక్నిక్‌, గురుకుల లెక్చరర్‌ ఉద్యోగాలు సాధించారు. అందులో గురుకుల డిగ్రీ లెక్చరర్‌ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు, మల్టీజోన్‌–2లో 4వ ర్యాంకు సాధించి డిగ్రీ లెక్చరర్‌ ఉద్యోగాన్ని సాధించారు. అదే విధంగా గురుకుల జూనియర్‌ లెక్చరర్‌ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మల్టీజోన్‌–2లో ప్రథమ ర్యాంకు, పాలిటెక్నిక్‌ లెక్చరర్‌ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, మల్టీజోన్‌–2లో 6వ ర్యాంకు, జనరల్‌ జూనియర్‌ లెక్చరర్‌ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు, బీసీ (ఏ) కేటగిరిలో మల్టీజోన్‌–2లోను, రాష్ట్ర స్థాయిలోనూ ప్రథమ ర్యాంకు సాధించి వరుసగా నాలుగు గెజిటెడ్‌ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. కృష్ణంరాజు ఒకేసారి నాలుగు ప్రభుత్వ గెజిటెడ్‌ ఉద్యోగాలను సాధించడం పట్ల అతడి కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ సాధనలో సహకరించిన సన్నిహితులకు కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

- ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో రూ.70లక్షలతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాల బాలికలు చదువుకునేందుకు, మధ్యలోనే చదువు మానివేయకుండా బాల్య వివాహాలను నివారించేందుకు కస్తూరిబా గాంధీ విద్యాలయం ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్‌ విద్యను అందించాలన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్‌ శంకర్‌నాయక్‌, తహసీల్దార్‌ సురేష్‌కుమార్‌, ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంఈఓ బాలాజీనాయక్‌, పోదిల శ్రీనివాస్‌, కూరాకుల చిన రామయ్య, నాగేశ్వర్‌రావు, బాలునాయక్‌, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, పాఠశాల ప్రత్యేక అధికారిని నాగలక్ష్మి, ఎస్‌ఐ శేఖర్‌ తదితరులున్నారు.



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్‌ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీ లాజిస్టిక్‌ (కార్గో) ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజియన్‌ సేల్స్‌ టీం లీడర్‌ శ్యాంకుమార్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు, ఇతర ప్రాంతాల్లో ఆసక్తి ఉంటే రూ.1000డీడీ చెల్లించాలన్నారు. వివరాలకు 91542 98690, 91542 98693, 91542 98694, 91542 98695ను సంప్రదించాలని కోరారు.

నిజాయితీగా ఉన్నందుకే టికెట్‌ రాలేదు

- ఉచిత బస్సు తప్ప మరేమీ పథకాలు అమలు కాలేదు
- పరీక్షలు వాయిదా వేయాలని వస్తే ఇనుప కంచెలు వేయడం సరైంది కాదు
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

యాదగిరిగుట్ట: 'ఇటీవల జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో నా దగ్గర రూ.10కోట్లు ఉంటే ఎంపీ టికెట్‌ వచ్చేది.. నీతి, నిజాయితీతో ఉన్న కాబట్టే టికెట్‌ రాలేదు' అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం, యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా భూ కబ్జాలు చేయలేదని, అక్రమాలకు పాల్పడలేదన్నారు. ఇప్పటికీ యాదగిరిగుట్ట పట్టణంలో గజం భూమి లేదని, అదే తన నిజాయితీకి నిదర్శనం అని అన్నారు. ప్రజలయందు వర్థిల్లు నాయకుడు రాజకీయాలకు పనికి రాడని.. కోట్ల రూపాయాలు సంపాదించిన వాళ్లు నేటి రాజకీయాల్లో ఉంటున్నారన్నారు. ఇటీవల పార్లమెంట్‌ ఎన్నికల్లో 80లక్షలు ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. 11 జనరల్‌ స్థానాలు ఉంటే.. వాటిలో కూడా ఒకే సామాజిక వర్గానికే అధిక సీట్లు ఇచ్చారని విమర్శించారు. ఒకే కులానికి సీట్లు, పదవులు ఇస్తామంటే బడుగు, బలహీన వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తాను కాంగ్రెస్‌ పార్టీని బతికించాలనే ఉద్దేశంతో ఆ పార్టీలో చేరానన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో 8 సీట్లకు పడిపోవడం అనేది బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో 16 సీట్లు కాంగ్రెస్‌ గెలుచుకోవాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో 8 సీట్లకు పడిపోవడం ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. గ్రూప్స్‌, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు రోడ్లపైకి వస్తే ముళ్ల కంచెలు వేసి పోలీసులు కొడుతున్నారని, ఇది బాధాకరం అని అన్నారు. నిరుద్యోగులకు రూ.5వేల నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబునాయుడు మూడు నెలల్లో 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నారన్నారు. రెండు నెలల బకాయిలు ఉన్న పింఛన్లు ఒకే రోజులో పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు పక్కన డిప్యూటీ సీఎం పవన్‌ కళ్యాణ్‌ ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉందని, తెలంగాణాలో కూడా భట్టి విక్రమార్క ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని డిమాండ్‌ చేశారు. తెలంగాణాలో ఫ్రీ బస్సు పథకం తప్పా.. ఏ పథకాలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. అంతకు ముందు కార్యకర్తల సమక్షంలో కేక్‌ కట్‌ చేశారు.



యాదాద్రీశుడి ఆలయంలో మోత్కుపల్లి నర్సింహులు తదితరులు